GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా
T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం- అక్టోబర్, 30-2025 పేజీలు : 2

# మొంథా వీరంగం

## స్తంభించిన జనజీవనం



- 4 లక్షల ఎకరాల్లో పంటలకు దెబ్బ
- విరిగిపడిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు

**టీ మీడియా, అక్టోబర్ 29,అమరావతి బ్యూరో :** మొంథా తుపాను మంగళవారం రాత్రి కాకినాడ సమీపంలోతీరం దాటింది. తొలుత హెచ్చరించినంత తీవ్రంగా లేకపోయినా శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఈదురుగాలులు, భారీవర్షాలతో ముంచేసింది. 22 జిల్లాల్లోని 403 మండలాలపై తుపాను ప్రభావం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 1,204 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 75,802 మందిని ముంపు ప్రాంతాల నుంచి తరలించింది. వారికి అక్కడ ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పించింది. సుమారు 4.4 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, పెసర సహా ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమిక నివేదికలు అందాయి. తుపాను ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచే తీరంలో అలల తీవ్రత పెరిగింది. అధిక వేగంతో ఈదురుగాలులు వీయడంతో ఉమ్మడి తూర్పుగోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో వందల చెట్లు నేలకూలాయి.సహాయక చర్యల్లో నిమగ్నమైన యంత్రాంగం వాటిని ఎప్పటికప్పుడు తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూసింది. విద్యుత్తు స్తంభాలు విరిగిపడిన చోట సాధ్యమైనంత వరకు వెంటనే పునరుద్ధరించారు. సాయంత్రం 7 గంటల నుంచి తీరప్రాంతాల్లోని జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు నిలిపేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మామిడికుదురు మండలం మాకనపాలెంలో తాటిచెట్టు విరిగిపడి ఒక మహిళ మృతి చెందారు. కృష్ణా జిల్లా కృత్తివెన్నులో కొబ్బరిచెట్టు పడి ఒకరి కాలికి తీవ్రగాయమైంది. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని యరజర్ల-వెంగముక్కలపాలెం వాగులో కారు కొట్టుకుపోయింది. విజయవాడలో కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో కూటమి పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు.మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో 17.2 సెం.మీ, ఉలవపాడు 17.0, దగదర్తి 15.6, జలదంకి 14.1, ప్రకాశం జిల్లా పాకలలో 13.8 సెం.మీ వర్షం నమోదైంది. జిల్లావ్యాప్తంగా పొంగుతున్న వాగులు, వంకలు పొంగిపోతున్నాయి. వాగుల ఉద్ధృతికి అన్ని రహదారుల్లో రాకపోకలు నిలిపివేశారు.

### నేలవాలిన రైతన్నల ఆశలు



తుపాను ప్రభావంతో వానల తీవ్రత మరింత పెరగడంతో కోత, కంకి దశలో ఉన్న వారి నేల వాలింది. రైతులకు తీరని నష్టం జరిగింది. అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 35వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. శ్రీకాకుళం నుంచి తిరుపతి జిల్లా వరకు అన్నిచోట్లా వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని కృష్ణా జిల్లాలో వరి, అరటి, బొప్పాయితోటలు నేల వాలాయి. ప్రకాశం జిల్లాలో ఉద్యాన పంటల నష్టం అధికంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 350 హెక్టార్లలో పంటనష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. విజయనగరం జిల్లాలో 12 మండలాల్లో సుమారు 7వేల ఎకరాల వరి నేలవాలింది.గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తీత దశలో ఉన్న పత్తి వర్షాలకు తడిసిపోయింది. వరి ఈనె దశ నుంచి గింజ పాలుపోసుకునే దశలో ఉన్నందున భారీ గాలులకు నేలవాలే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాగుల వెంబడి ఉన్న మిరప నీట మునుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కంకి దశలో ఉన్న మొక్కజొన్న, పూత దశలో ఉన్న కంది, కోతదశలో ఉన్న వేరుసెనగ, అపరాలు వర్షాలకు దెబ్బతింటున్నాయి. అరటి, కంద, బొప్పాయి గాలుల తీవ్రతకు ధ్వంసమవుతున్నాయి.కృష్ణా జిల్లాలో చల్లపల్లి, మోపిదేవి, తోట్లవల్లూరు తదితర మండలాల్లోని లంక గ్రామాల్లో బొప్పాయి, అరటి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 875 హెక్టార్లలో వరి, 107 హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా మొవ్వ మండలం పెదముత్తేవిలో 23 హెక్టార్లు, కోసూరులో 21, మచిలీపట్నంలోని బుద్దాలపాలెంలో 17 హెక్టార్లలో వరి పంట దెబ్బతింది.

### జనజీవనం స్తంభించింది

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం వల్ల జన జీవనం స్తంభించింది.

మిగతా 2లో



## అప్రమత్తంగా ఉండాలి

-ఎలాంటి ఇబ్బందులు రానీయొద్దు

-సీఎం రేవంత్ రెడ్డి

**టీ మీడియా , అక్టోబర్ 29 , హైదరాబాద్ బ్యూరో :** మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నందున రాష్ట్రవ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని దిశానిర్దేశం చేశారు.

**ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

పలుచోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువ ఉండటంతో పాటు హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం, పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని, కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సీఎం సూచించారు.

**ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి**

వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సీఎం సూచించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జిలు, కాజ్ వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని తెలిపారు.

**ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి**

పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి తెలిపారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమి కీటకాలు విజృంభించి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్? అండ్? బీ, వైద్యారోగ్య, పోలీసు, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం తెలిపారు. హైదరాబాద్?లో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**మంత్రి సీతక్క ఆదేశాలు**

తుపానుపై మహబూబాబాద్, ములుగు అధికారులతో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు పరిస్థితులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. రైళ్లు నిలిచిపోయినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ప్రభుత్వ సూచనలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.


# అంతా టీమ్ వర్క్ చేశాం

-సీఎం చంద్రబాబు

**టీ మీడియా , అక్టోబర్ 29 , అమరావతి :** గత నాలుగైదు రోజుల నుంచి మొంథా తుఫాన్ విషయంలో సమర్థవంతంగా వ్యవహరించి నష్టనివారణ చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సీఎం నుంచి సచివాలయం సిబ్బంది వరకు జిల్లా అడ్మినిస్ట్రేషన్‌తో సహా అంతా కలిసి బృందంగా పని చేశామని సీఎం అన్నారు. కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం అభినందనలు తెలిపారు.మరో రెండు రోజులు ఇదే విధంగా పని చేస్తే బాధిత ప్రజలకు మరింత ఊరట ఇవ్వగలమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ నష్టం అంచనాలను త్వరితగతిన సిద్దం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

**ముందస్తు చర్యలతోనే నివారణ**

తుఫాన్ రావడంతో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని తెలిపారు. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని వివరించారు. వారికేమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలన్నారు. మొంథా తుఫాను వల్ల వివిధ విభాగాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలి. సచివాలయాలపై మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టంను ఏర్పాటు చేసి కింది స్థాయి వరకూ ప్రభుత్వ ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించామని, ఇదొక నూతన విధానం ద్వారా




తీసుకొచ్చామని స్పష్టం చేశారు. తుఫాన్‌ను ఎవరూ నివారించలేరు. అయితే ముందు జాగ్రత్తలతో నష్టాలను నివారించగలుగతామని అన్నారు.

**మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా**

ప్రధానంగా కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూమ్?లో కూర్చుని రియల్ టైం సమాచారం తెప్పించుకుని జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది బాగా పని చేశారన్నారని ప్రశంసించారు. చెట్లు కూలినా, విద్యుత్ వైర్లు తెగిపడినా యుద్ధప్రాతిపదికన తొలగించారని గుర్తు చేశారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రెయిన్లు క్లీన్ చేయడం వల్ల కాలనీలను ముంపుబారిన పడకుండా చేయగలిగామని వివరించారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సైతం పునరుద్ధరించేందుకు 10,000 మందిని అందుబాటులో పెట్టుకున్నామని స్పష్టం చేశారు.నేడు సాధారణ స్థితి ఏర్పడుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. తుపాన్ కారణంగా ఇద్దరు చనిపోయారని ఆవేదవ వ్యక్తం చేశారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై మరింత నమ్మకం కలుగుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో వ్యాఖ్యానించారు.

## సమగ్రాభివృద్ధే లక్ష్యం : -మంత్రి వాకిటి



**టీ మీడియా, అక్టోబర్ 29, దేవరకద్ర:**మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. నార్లోని కుంట గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ భవనం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుతాయని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

తదుపరి దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గొప్లాపూర్, మీనగొనపల్లి, బలుసుపల్లి వార్డులలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్క్ నిర్మాణ పనులకు మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ప్రజల ఆరోగ్యాభివృద్ధి, పిల్లల వినోదం, పట్టణాల సుందరీకరణ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో %జజ% రోడ్డు నిర్మాణాలకు కూడా మంత్రి శ్రీహరి శంకుస్థాపన చేశారు. దేవరకద్ర పట్టణంలో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర లాకింగ్ బ్రిక్స్ టెక్నాలజీతో నిర్మించిన మోడల్ హౌస్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ , మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మరో ఎదురుదెబ్బ

- 51 మంది నక్సలైట్లు సరెండర్

టీ మీడియా , అక్టోబర్ 29 , ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయేందుకు మావోయిస్టులు వరుస కడుతున్నారు. తాజాగా బీజాపుర్ జిల్లాలో 51మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారిలో 9మంది మహిళా సభ్యులు ఉన్నట్లు చెప్పారు. మరోవైపు ఈనెల 26న లొంగిపోయిన కాంకేర్ జిల్లాకు చెందిన 21మంది మావోయిస్టులను పోలీసులు బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారిలో కేశ్ కాల్ డివిజన్ కార్యదర్శి ముకేశ్ సహా 13మంది మహిళా సభ్యులు, 8మంది పురుషులు ఉన్నారని బస్తర్ సుందర్ రాజ్ తెలిపారు.ఆ కే 47,స్ ల ర్ , ఇన్సాస్‌సహా 18ఆయుధాలను అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. మావోయిస్టుల లొంగుబాటును స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా అడవుల్లో ఉన్న మావోయిస్టులు కూడా లొంగిపోవాలన్న బస్తర్ %X.+%, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

# తెలంగాణ కేబినెట్ విస్తరణ

## మంత్రివర్గంలోకి అజారుద్దీన్..?

**టీ మీడియా, అక్టోబర్ 29, హైదరాబాద్ బ్యూరో :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఏఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రి వర్గంలో మాజీ క్రికెటర్? అజారుద్దీన్?కు అవకాశం కల్పించనుంది. శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్? పార్టీ వర్గాలు వెల్లడించాయి. అజారుద్దీన్?తో గవర్నర్ మంత్రిగా ప్రమాణం చేయించనున్నట్లు తెలుస్తోంది. ఆయనకు ఏ శాఖ కేటాయిస్తారనే దాని మీద ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.మంత్రివర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఆల్? ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)లో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా, మరో ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశముంది. అయితే ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతానికి మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

**మైనార్టీకి ఒక మంత్రి పదవి**

రాష్ట్రంలో ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగినా, ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఎక్కడా విజయం సాధించలేదు. నాంపల్లి నుంచి ఫిరోజ్?ఖాన్, షబ్బీర్? అలీ, అజారుద్దీన్? వంటి వారు ఓటమి చెందారు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్? పార్టీకి సాధ్యపడలేదు.ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ హైకమాండ్? ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకుంది.

**ఆమోదం తెలుపని రాజ్?భవన్**

గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్? కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్? వర్మ ఇంకా ఆమోదం తెలుపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం గ్రీన్? సిగ్నల్? ఇచ్చింది.మంత్రి వర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొదటి సారి సీఎం రేవంత్? రెడ్డితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది.



**ఎమ్మెల్సీ దక్కని పక్షంలో మరో ప్రత్యామ్నాయం**

ఒక వేళ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో త్వరలో కొన్ని శాసన మండలి స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల లోపు అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై ఏఐసీసీ కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది.

## రూ.35 లక్షలు ఇస్తే ఉద్యోగం పక్కా

-వెలుగులోకి భారీ స్కామ్

**టీ మీడియా , అక్టోబర్ 29 , చెన్నై :** తమిళనాడు రాష్ట్ర మున్సిలప్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు వరకు ముడుపులు తీసుకుంటున్నారు. ఓ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్?ఫోర్స్?మెంట్ డైరెక్టరేట్? చేపట్టిన సోదాల్లో ఈ జాబ్? స్కామ్? బయటపడింది. దీనితో వారు తమిళనాడు పోలీసు విభాగానికి లేఖ రాశారు. ఈ కుంభకోణంలో అత్యంత శక్తివంతమైన రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉన్నారని తెలుస్తోంది.

**ఉద్యోగాలు అమ్మేశారు**

తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగానికి సంబంధించి 2024లో రిక్రూట్?మెంట్ చేపట్టారు. ఇందులో అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్? అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్?స్పెక్టర్లు తదితర పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాల కోసం దాదాపు 1.12 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే రిక్రూట్?మెంట్? పరీక్షను నిర్వహించి 2,538 మందిని జాబ్స్? కోసం ఎంపిక చేశారు. అంతేకాదు ఈ ఏడాది ఆగస్టులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక పత్రాలు కూడా అందజేశారు.

**స్కామ్ వెనుక బడా రాజకీయ నేతలు**

అయితే ఈ నియామక ప్రక్రియలో చాలా అవకతవకలు

మిగతా 2లో






## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన

**టీ మీడియా, అక్టోబర్ 29, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం లో బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలు దుకాణాలలో బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ల విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం ప్రజా పాలనని చెప్పుకుంటూ విద్యార్థులకు కావలసిన నిధులు మంజూరు చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న విద్యార్థుల అవస్థలు ప్రభుత్వానికి పట్టింపు లేదా అని ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి నశించి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.పెండింగ్లో ఉన్నటువంటి 8500 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పుప్పాల అభిషేక్, రోహిత్,చరణ్, ఇసాక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### -జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**టి మీడియా, అక్టోబర్ 29, మెదక్ ప్రతినిధి:**విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం తూప్రాన్ మండలంలోని రావెల్లి లో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నూతన పిహెచ్సి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. నిర్మాణంలో ఉన్న సమీకృత కార్యాలయ సముదాయాన్ని పరిశీలన చేశారు.గురుకుల పాఠశాల కళాశాలలో వంటగదిని,వంట సామాగ్రిని , వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినిలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలు గురికాకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు చదువుకొని మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ పరిధిలో నూతన పిహెచ్సి భవన నిర్మాణాన్ని స్థల పరిశీలన చేశారు.ఎంత మేరకు స్థలం అవసర పడుతుందో, ఏ విధంగా భవన నిర్మాణం చేయాలో అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న సమీకృత కార్యాలయాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డిఓ జయచంద్ర, రెడ్డి తాసిల్దార్లు ఉన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన భూపతి రెడ్డి

**టీ మీడియా, అక్టోబర్ 28,మేడ్చల్:**నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ భరత్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ చిరంజీవి, ఎన్ఎమ్ సి ఎస్సి సెల్ అధ్యక్షుడు మహేష్, పంగా శ్రీనివాసరావు, సత్య ప్రసాద్ పాల్గొన్నారు.




## బిఆర్ఎస్ నాయకుల డ్రామాలు

**టీ మీడియా, అక్టోబర్ 29,పెబ్బేరు** :బుధవారం లోకల్ బాడీ ఎలక్షన్ లో ఉనికిని కాపాడుకోవడానికి బి ఆర్ ఎస్ నాయకుల డ్రామాలు మానుకోవాలి అని బుధవారం యూత్ కాంగ్రెస్ ఆఫీస్ లో నిర్వయించినటువంటి ప్రెస్ మీట్ లో యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు పెబ్బేరు పట్టణ అభివృద్ధి గురించి మీరు మాట్లాడుతుంటే సిగ్గుచేటుగా ఉంది అన్నారు గత 10 సంవత్సరాల నుండి అధికారం లో ఉండి పెబ్బెర్ పట్టణ అభివృద్ధి ఎందుకచెయ్యలేకపోయారు ఇపుడు వనపర్తి ఎం ఎల్ ఏ 15 కోట్ల నిధులు పెబ్బెర్ పట్టణ అభివృద్ధికి విడుదల చేసినందుకు ఎక్కడ క్రెడిట్ మాకు దక్కకుండా పోతుందో అని రోడ్ల మీదకి వచ్చి ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారు అసలు సంత కబ్జా కి గురి అయింది ఎవరి హయాం లో అసలు సంత ని ఎవరు ఎవరికి కట్టబెట్టారో మీకు మీ నాయకుడికి తెలియదా సంత విషయంలోనే కదా మీ పార్టీ కి క్రరుకాల్చి వాత పెట్టింది ఇపుడు అది అందరికి తెలుసు మళ్ళీ మీరు మొసలి కన్నీరు కార్చడం తగునా మీరు అధికారం లో ఉన్నపుడు ఏ ఒక్కరోజు కూడా సంత స్థలం గురించి ఎందుకు మాట్లాడలేదు ఇపుడు అధికారం కోల్పోయాక గుర్తుకు వచిందా మీకు రోడ్ల విస్తరణ గురించి మాట్లాడే ముందు అసలు 10 సంవత్సరాల నుండి మీరు ఎందుకు చెయ్యలేకపోయారు రోడ్ల విస్తరణ మీ నాయకుల ఇల్లు ఎందుకు కూల్చలేదు కార్యక్రమంలో వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ యు శివకుమార్ జనరల్ సెక్రటరీ సుగూర్ శివ పెబ్బేర్ మండల యూత్ అధ్యక్షులు యం రాజేష్ గంధం శివకుమార్ యువజన నాయకులు శాగాపూర్ శివ తదితరులు పాల్గొన్నారు

### 35 లక్షలు ఇస్తే..

జరిగినట్లు ఈడీ గుర్తించింది. దాదాపు 150 మంది అభ్యర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని తెలిపింది. ఇందుకోసం ఆయా అభ్యర్థుల నుంచి ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు చొప్పున లంచాలు తీసుకున్నట్లు గుర్తించామని చెప్పింది. అంతకంటే ఘోరమైన విషయం ఏమిటంటే, ఈ జాబ్ స్కామ్? వెనుక తమిళనాడుకు చెందిన పలువురు బడా రాజకీయ నాయకులు, కొన్ని సంస్థలు ఉన్నాయని తెలిపింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్?కు ఈడీ లేఖ రాసింది. అంతేకాదు ఈ కుంభకోణానికి సంబంధించి 232 పేజీల ఆధారాలను సమర్పించింది. ఈ పరీక్ష నిర్వహించిన అన్నా యూనివర్సిటీపై కూడా దర్యాప్తు చేయాలని ఈడీకోరినట్లుతెలుస్తోంది.ఈ జాబ్ స్కామ్ వెలుగులోకి రావడంతో తమిళనాడులో రాజకీయ దుమారం చెలరేగింది. నటుడి విజయ్?కు చెందిన టీవీకే పార్టీ తమ సోషల్ మీడియాలో ఈ కుంభకోణం గురించి ఓ పోస్టు పెట్టి, స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. అయితే ఈ వార్తలపై ఇప్పటి వరకు తమిళనాడు ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి స్టాలిన్ కానీ స్పందించకపోవడం గమనార్హం. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో స్టాలిన్ సర్కార్? ఇరకాటంలో పడింది.

**బీజేపీ అవినీతిపై స్టాలిన్ ఫైర్?**

ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. అవినీతిపరులు బీజేపీలో చేరగానే కడిగిన ఆణిముత్యాల్లా వైట్ వాష్ ఎలా అవుతున్నారని ఆయన ప్రశ్నించారు. తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసుతో పాటు యావత్ దేశ ప్రజల మనసుల్లో ఇంకా చాలా ప్రశ్నలు మెదులుతున్నాయని అన్నారు. వాటిలో కొన్ని ప్రశ్నలను తాను ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నానని చెప్పారు. బీజేపీ కూటమి అనే వాషింగ్ మెషీన్ అవినీతిపరులు, లంచగొండులను మరక లేని తెలుపు రంగులోకి ఎలా మారుస్తోందో చెప్పాలని మోదీ సర్కారును సీఎం నిలదీశారు.

# నిలిచిన పత్తి కొనుగోళ్లు



### -రహదారిపై రైతుల నిరసన

**టీ మీడియా , అక్టోబర్ 29 ,ఊట్కూర్ :** నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల పరిధిలోని విజయ కాటన్ ఇండస్ట్రీలో బుధవారం పత్తి కొనుగోళ్లను అధికారులు నిలిపివేశారు. సీసీఐ చేపట్టిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులు మూసివేయడంతో ఆగ్రహించిన పత్తి రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పత్తి రైతుల నిరసనతో దాదాపు మూడు గంటల పాటు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి.

**సీసీఐ తీరుపై తీవ్ర ఆగ్రహం**

రైతుల ధర్నాతో నారాయణపేట మక్తల్ వైపు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు బారులు తీరి నిలవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాల కారణంతో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించగా రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ముందస్తు టైం స్లాట్ నమోదు చేసుకున్నామని, తమకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ఈరోజు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తే వాహనాలు, కూలీల ఖర్చును ఎవరు భరించాలని రైతులు సీసీఐ అధికారులను నిలదీశారు.

**తక్షణమే కొనుగోలు చేయాలి**

ప్రకృతి ప్రకోపంతో పత్తి పంటలు దిగుబడి తగ్గి తీవ్ర నష్టాల్లో ఉన్నామని.. పండిన కొద్దిపాటి పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం, అధికారులు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే దిగివచ్చి పత్తి కొనుగోలను ప్రారంభించాలని రైతులు భీష్మించారు. విషయం తెలుసుకున్న మక్తల్ సీఐ రామ్ లాల్, ఊట్కూర్ ఎస్సై రమేష్ బలగాలతో ఇండస్ట్రీ వద్దకు చేరుకొని ముందస్తు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో ఊట్కూరు తహసీల్దార్ చింత రవి, నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివ రెడ్డి రైతుల ధర్నా వద్దకు చేరుకొని సీసీఐ అధికారులతో చర్చలు జరిపారు.

**దిగివచ్చిన అధికారులు**

మధ్యాహ్నం 12 గంటల తర్వాత కొనుగోళ్లను ప్రారంభించేందుకు అధికారులు ఇచ్చిన హామీతో రైతులు శాంతించి ఆందోళనను విరమించారు. కాగా, పత్తికి 8 నుండి 12% తేమ నిబంధనను విధించి సీసీఐ కొనుగోళ్లను చేపట్టింది. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా 12 శాతం కంటే ఎక్కువ తేమ కలిగిన పత్తిని కొనుగోలు చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని, ఈ నిబంధనతో పత్తి అమ్మకాలు జరగడం లేదంటూ రైతులు తమ ఆవేదనను తాసిల్దార్ ముందు వినిపించారు. పత్తికి తేమ శాతం నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధర్నాకు మద్దతుగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం.భరత్, బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అశాస్త్రీయంగా బ్యాటరీల రీసైక్లింగ్

### పుట్టగొడుగుల్లా యూనిట్లు

**టీ మీడియా , అక్టోబర్ 29 , హైదరాబాద్ బ్యూరో :** పదుల సంఖ్యలో లెడ్ యాసిడ్ బ్యాటరీ రీసైక్లింగ్ యూనిట్లు నిబంధనలను తుంగలో తొక్కుతూ నగరంలో తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వెలువడే వ్యర్థాలను సమీపంలోని జలాశయాలకు తరలిస్తూ, కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి. కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్ఓ), కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్మెంట్ (సీఎఫ్ఈ) అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తుంటడంతో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిఘా కూడా వీటిపై లేకుండాపోతోంది. అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేస్తుండటంతో భూ, జల, వాయుకాలుష్యం ఎక్కువగా ఏర్పడుతోంది.

**ప్రక్రియ ఇదీ**

బ్యాటరీలను శాస్త్రీయ పద్ధతుల్లో, పీసీబీ సూచించిన ఆయా నిబంధనల మేరకు రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్రమాదకర రసాయన పదార్థాలు బయటకు రాకుండా కాలుష్యాన్ని నివారించే అవకాశం ఉంటుంది. ఉపయోగించిన బ్యాటరీల నుంచి లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి లోహాలను తిరిగి పొందడం ద్వారా కొత్త బ్యాటరీల తయారీకి ఎక్కువగా గనులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

**అధిక ఉష్ణోగ్రతతో లోహాలను కరిగించి**

ఈ ప్రక్రియలో బ్యాటరీలను ముందుగా డిశ్చార్జి చేసి, ఆపై జాగ్రత్తగా వాటిని విడదీసి, చిన్న చిన్న ముక్కలుగా కట్? చేస్తారు. వాటి భాగాల నుంచి లోహాలను వేరు చేయడానికి పైరో మెటలర్జీ పద్ధతి (అంటే అధిక ఉష్ణోగ్రతలను ఉపయోగించి లోహాలను కరిగించి వేరు చేయడం అన్నమాట), అలాగే హైడ్రో మెటలర్జీ (అంటే రసాయన ద్రావణాలను వినియోగించి విలువైన లోహాలను కరిగించి వేరు చేస్తారు) లోహాలను శుద్ధి చేసి బ్యాటరీలలో లేదా ఇతర వస్తువుల్లో తిరిగి మళ్లీ ఉపయోగిస్తారు.

**ఏం చేస్తున్నారో తెలుసా**

సాధారణంగా డీలర్లు, సర్వీస్ సెంటర్లు లేదా స్పెషల్ కలెక్షన్ పాయింట్ల ద్వారా పాడైన లేదా పాత బ్యాటరీలను సేకరించాలి. తయారీదారులు, డీలర్లు ఎక్స్టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్) కింద వీటిని తిరిగి సేకరించాలని సీపీసీబీ నియమ నిబంధనలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్? నగరంలో ఈ బాధ్యతను దాదాపు 40 సంస్థలకు అప్పగించారు. కానీ ఇవి అనధికారికంగా ఏర్పాటవుతున్న బ్యాటరీ రీసైక్లింగ్ యూనిట్లకు తరలివెళ్తుండటం గమనార్హం.అనుమతి లేకుండా ఉన్న యూనిట్లలో ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ ఎక్విప్మెంట్ల వంటి వాటిని ఏర్పాటు చేయడం లేదు. ఫర్నేస్లకు బ్యాగ్ ఫిల్టర్లు సైతం ఏర్పాటు చేయడం లేదు. చేసినా వాటి నిర్వహణను పూర్తిగా విస్మరిస్తున్నారు. బ్యాటరీల నుంచి వచ్చే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారేస్తున్నారు.ఉదయం పూట పని చేస్తే చుట్టుపక్కల నివాసం ఉండే స్థానికుల నుంచిఇబ్బందులొస్తాయని,రాత్రి12నుంచిఉదయం8 గంటలవరకువీటినిగుట్టుచప్పుడుకాకుండానిర్వహిస్తున్నారు.

**విద్యుత్తు శక్తి నిల్వ పరికరం**



బ్యాటరీ అనేది విద్యుత్తు శక్తి నిల్వ పరికరం. అది తన ఇంధనాన్ని ఇంటర్నల్?గా స్టోర్ చేస్తుంది. ఫ్యూయల్ సెల్ అనేది శక్తి మార్పిడి పరికరంగా పనిచేస్తుంది. అందుబాటులో ఉన్న ఇంధనాన్ని మార్చడం ద్వారా పవర్?ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో ఇంధనం ఎక్స్?టర్నల్?గా సప్లై అవుతుంది. ఎలక్ట్రోడ్లు కరిగిపోగానే బ్యాటరీ మెల్లగా డౌన్ అవుతుంది. అయితే ఫ్యూయల్సెల్ మాత్రం ఆక్సిజన్, హైడ్రోజన్ అందించినంత కాలం పని చేస్తూనే ఉంటుంది. అందుకే మన్నిక పరంగా బ్యాటరీ కంటే ఫ్యూయల్ సెల్ ఎక్కువగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇవి రెండూ ఒకేరకమైన విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి.

# ఉమ్మడి కృష్ణా జిల్లాపై తుపాను ప్రభావం

### ఆదుకోవాలంటున్న రైతులు



**టీ మీడియా , అక్టోబర్ 29 , అమరావతి :** మొంథా తుపాను ఉమ్మడి కృష్ణా జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తుపాను బీభత్సానికి విజయవాడ నగరం అతలాకుతలమైంది. విజయవాడ గ్రామ సమీపంలో ఉన్న జిల్లా పరిషత్? ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు తలదాచుకుంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే స్థానికులు పునరావాసంలో అధికారులు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికం దోభికానా ప్రాంతంలో నివాసముంటున్నారు. 50 కుటుంబాలను స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి ఉన్న గ్రామీణ పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తరలించారు. తుపాను తీవ్రత చూసిన బాధితులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.విజయవాడ నగర్ శివారులో ఉన్న పాతపాడు, అంబాపురం గ్రామాల పరిధిలోని మొంథా తుపాను కారణంగా నష్టాన్ని క్షేత్రస్థాయిలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా పరిశీలించారు. అనంతరం తుపాను కారణంగా అధిక వర్షపాతం నమోదు కానున్న నేపథ్యంలో విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ, ఎంపీడీవోలకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జేసి ఇలక్కియా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 25 తుపాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో నివాస ఉంటున్న ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించమని చెప్పారు. వారికి కావలసిన ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు. నిన్న, ఇవాళ తుపాను ప్రభావం వల్ల జిల్లా వ్యాప్తంగా 50 పైగా కరెంటు స్తంభాలు దెబ్బ తిన్నాయి. వాటన్నింటినీ శాఖల సమన్వయంతో త్వరితగతిన మార్చి, విద్యుత్ పునరుద్ధిస్తున్నామని తెలియజేశారు.

**వరద ముంపులో దెబ్బతిన్న పంటలు**

మరోవైపు ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నందిగామ నుంచి చందర్లపాడు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపై వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోపక్క వరద ముంపులో వరి పైర్లు దెబ్బ తిన్నాయి. వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న వరి పైరులకు వరద ప్రవహిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఏసీపీ తిలక్, ఆర్డీవో బాలకృష్ణ వాగు వద్ద పరిశీలించారు. పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూరు, వెల్దుర్తిపాడు గ్రామంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వరి పంట సాగు చేస్తున్న భూముల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్నందున వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. నష్ట పరిహారం అందించాలని బాధితులు కోరుకుంటున్నారు.అదే విధంగా తుపాన్ తీరం దాటిన వాయుగుండం ప్రభావం వల్ల నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఏకదాటిగా వర్షం పడుతుంది. నందిగామలో అగ్నిమాపక కేంద్రాన్ని వరద ముంచెత్తింది. దాంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఈదురు గాలులతో భారీ వర్షం కారణంగా పత్తి, మిర్చి, వరి, అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. గాలులకు చెట్లు, మొక్కలు పడిపోయాయి. పొలాల్లో నీరు నిలవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.పెనుగంచిప్రోలు సమీపంలోని గండి వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో పెనుగంచిప్రోలు–గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక డీవీఆర్ కాలనీ, ముక్కపాటి కాలనీలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్థానిక పునరావస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. పంట, ఆస్తి నష్టంపై వెంటనే అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులు ఆదేశించారు.

# మొంథా వీరంగం

తీర ప్రాంత మండలాల్లో ఈదురు గాలుల తీవ్రత పెరిగింది. వాగులు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. కంభం, కనిగిరి ప్రాంతాల్లో కొన్నిచోట్ల మట్టిమిద్దెలు కూలాయి. ఒంగోలులో విద్యుత్తు సరఫరా నిలిచింది. నగర శివారు కాలనీలు, లోతట్టు గ్రామాలు జలమయం కావడంతో 2,377 మందిని 54 పునరావాస కేంద్రాలకు తరలించారు. పలుచోట్ల స్తంభాలపై చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సింగరాయకొండ మండలంలోని మత్స్యకార గ్రామాల్లో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, జిల్లా ప్రత్యేకాధికారి కోన శశిధర్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

**వానతో తంటాలు**

శ్రీకాకుళం జిల్లాలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. వరద ప్రవాహానికి వజ్రపుకొత్తూరు మండలం పెద్దబడాం వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. సోంపేట మండలం బారువా వద్ద ఓపెన్‌హెడ్ ఛానల్ కోతకు గురైంది. వంశధార, నాగావళి, బాహుదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. తీరంలో మత్స్యకార గ్రామాలను ఖాళీ చేయించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 80 పునరావాస, 41 తుపాను రక్షిత కేంద్రాలను సిద్ధం చేశారు. ఈదురు గాలులకు ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల్లో చేతికందిన వరి పైరు నేలకొరిగింది. పొందూరు, కంచిలి, కవిటి మండలాల్లో మట్టి ఇళ్ల గోడలు కూలిపోయాయి.

**కెరటాల అలజడి**

కృష్ణా జిల్లాలో ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగా ఉంది. నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం, కృత్తివెన్ను, గన్నవరం తదితర మండలాల్లో చెట్లు నేల కూలాయి. విద్యుత్తు తీగలు తెగిపడటంతో సరఫరా నిలిచింది. గంటకు 93 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతోపాటు సాయంత్రం నుంచి వర్షం తీవ్రత పెరిగింది.మచిలీపట్నంలోని మంగినపూడి తీరంలో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. అలల తాకిడికి ఉధృతంగా ఉండడంతో బీచ్‌ను మూసేశారు. నాగాయలంక, హంసలదీవి, చినగొల్లపాలెం, పెదపట్నం తదితర తీర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముంపు, తీర గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు 177 పునరావాస కేంద్రాల్లో 11,317 మంది ఆశ్రయం పొందుతున్నారు. గుడ్లు, పాలు అందడం లేదని పలువురు బాలింతలు, గర్భిణులు వాపోయారు. కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, చల్లపల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లో ఈదురుగాలుల తాకిడికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగి విద్యుత్తు తీగలపై పడడంతో జిల్లాలోని నాగాయలంక, చల్లపల్లి, మచిలీపట్నం, కృత్తివెన్ను తదితర మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

# మళ్లీ సాగునీటి సంఘాలు వచ్చేస్తున్నాయ్

### -రైతు సంక్షేమ కమిషన్ సిఫారసు

**టీ మీడియా , అక్టోబర్ 29 , హైదరాబాద్ బ్యూరో :** రైతు దేశానికి వెన్నముక. వర్షం, సాగునీరే వారికి జీవనాధారం. పంట కోతకొచ్చే దశలో నీరందకపోవడం లేదా అధిక వర్షాల వల్ల పంట మొత్తం దెబ్బతినడంతో రైతులఆశలు ఆవిరవుతుంటాయి. ఇక చెరువులు, కుంటలు, నదుల్లోని జలాలే వ్యవసాయానికి కీలకం. సరైన పద్ధతిలో నీటి వనరుల వినియోగం లేకపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. తెలంగాణలో కాలక్రమేణా ఉనికిలో లేకుండా పోయిన సాగునీటి వినియోగదారుల సంఘాలను మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. మరి నీటి సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? పాత పద్ధతిని పునః ప్రారంభించడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలేంటి?

**సాగునీటి సంఘాల ఆవశ్యకత**

రైతులకు చెరువులు, కుంటలు ప్రధాన నీటి వనరులు. అయితే బ్యారేజీలు, రిజర్వాయర్లకు అనుసంధానమైన కాలువలు సాగు నీరందించడంలో కీలకంగా మారాయి. పంటకు అవసరమయ్యేంత నీరు అందుబాటులో ఉండి, సమర్థంగా వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. సాధారణంగా ప్రధాన నీటి ప్రాజెక్టులపైనే ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరిస్తుంటాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలే ప్రధాన నీటి వనరులు. మరి వాటి నిర్వహణపై తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

**సంఘాల నేపథ్యం**

సాగునీరు అందించడంలో చిన్న తరహా ఎత్తిపోతల పథకాలు, చెరువులు, కుంటలు, కాల్వల నిర్వహణ అత్యంత కీలకం. ఇవి పూర్తి స్థాయిలో పని చేస్తున్నప్పుడే ప్రతి ఎకరాకు నీరు అందుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997లో తీసుకొచ్చిన చట్టం ఆధారంగా 100 ఎకరాలకు పైగా ఉన్న ప్రధాన చెరువులకు 2006లో ఎన్నికల ద్వారా సాగునీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. క్షేత్ర స్థాయిలో రైతులనే ఆయా సంఘాలకు సభ్యులుగా నియమించి సాగునీటి పంపిణీ, చెరువులు, కాల్వల నిర్వహణ బాధ్యతలన్నీ ఎన్నికైన సభ్యులే చూసుకునేవారు.

**మళ్లీ తెరపైకి**

2008 వరకూ ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం 10,748 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండేవి. అందులో 43 శాతం తెలంగాణలో ఉన్నాయి. నాడు రైతుల నుంచి ఈ వ్యవస్థపై మంచి స్పందన లభించింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అవి రద్దయ్యాయి. సాగునీటి తీరువా పన్ను చెల్లింపుతో పాటు సాగునీటి సంఘాలు కూడా ఉనికిలో లేకుండా పోయాయి. దీంతో పాత సంఘాలు నిర్వీర్యం అవ్వడంతో నిధుల కొరత ఏర్పడింది. చిన్న నీటి వనరుల పరిరక్షణ, సాగునీటి సమర్థ వినియోగం కోసం రాష్ట్రంలో మళ్లీ సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

**రైతుల ప్రాతినిధ్యం ఉండేలా**

రైతు సంక్షేమ కమిషన్ సిఫారసు మేరకు సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. వీటి ద్వారా చెరువులు, కాలువల నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదట చెరువులతో ప్రారంభించి, క్రమంగా పెద్ద ప్రాజెక్టులకు విస్తరించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రతి సంఘానికి లష్కర్లను సిబ్బందిగా నియమించడంతో పాటు నీటి పారుదల శాఖకు సంబంధించిన అధికారిని కన్వీనర్‌గా నియమించాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు.

**చిన్న నీటి వనరుల సంరక్షణకు**

సాగునీటి సంఘాల ఏర్పాటు ద్వారా నీటి పారుదల శాఖకు సహకారం అందడంతో పాటు చెరువులు, కాల్వల నిర్వహణలో రైతులకు ప్రత్యక్ష భాగస్వామ్యం ఉంటుందన్నది ఆలోచన. చిన్న నీటి వనరుల సంరక్షణకు వినియోగదారుల సంఘాలు పని చేస్తాయని, క్రమం తప్పకుండా నిర్వహణ, మరమ్మతులు వంటి విషయాల్లో సకాలంలో స్పందన లభిస్తుందని భావిస్తున్నారు. సంఘాలు ఏర్పాటు చేయడంతో నీటి వనరులకు రక్షణగా నిలవడంతో పాటు అత్యవసర సమయంలో మరమ్మతులు చేయించడంతో రైతులను నష్టాల నుంచి ఆదుకోనున్నాయి.



**ఈ సమస్యలు పరిష్కారం**

ఈ సంఘాలు స్థానిక సాగునీటి వనరుల నిర్వహణకు బాధ్యత వహిస్తాయి. చెరువులు, కాలువల నీటి వినియోగం, మరమ్మతులు, నిర్వహణను రైతులే దగ్గరుండి పర్యవేక్షిస్తారు. కాల్వల మరమ్మతులు, చెరువుల ఎంబాంక్‌మెంట్ పునర్నిర్మాణం, స్లూయిస్ గేట్ల మరమ్మతుల వంటి సమస్యలు సంఘాల ఆధ్వర్యంలో పరిష్కారం కానున్నాయి. ఇవి కేవలం మరమ్మతులకే కాకుండా, నీటి పంపకాల్లో పారదర్శకంగా వ్యవహరించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి.రైతుల సూచనలు, ఫిర్యాదులు, అవసరాలను సాగునీటి సంఘం వేదికగా చర్చించి, ఎవరికి ఎంత మేరకు సాగు నీరందించాలన్న అంశాలపై రైతులే నిర్ణయం తీసుకుంటారు. ఆయకట్టు, ఇతర అవసరాలను పరిగణనలోకి తీసుకొని చిన్న సంఘాలు, మధ్యస్థాయి సంఘాలు, పెద్ద సంఘాలుగా విభజించనున్నారు. చిన్న చిన్న పనులకు సంబంధించి స్థానికంగానే నిర్ణయాలు తీసుకొని పనుల ప్రాధాన్యత నిర్ణయిస్తారు. సాగునీటి సంఘాలకు నామమాత్రపు రుసుముతో పాటు ప్రభుత్వం అంతే మొత్తంలో మ్యాచింగ్ గ్రాంట్ అందించాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులతో పాటు మహిళా రైతుల ప్రాతినిధ్యం, వెయ్యి ఎకరాలకు సాగునీటి విస్తరణ అధికారిని నియమించాలని అంటున్నారు.